విశాలాంధ్ర
అనకాపల్లి
శుక్రవారం 31, అక్టోబరు 2025

రాంబిల్లి మండలంలో కలెక్టర్ పర్యటన

విశాలాంధ్రబి అనకాపల్లి(రాంబిల్లి): మొంథా తుఫాన్ సృష్టించిన భీభత్సాన్ని అంచనా వేయుటకు యలమంచిలి నియోజకవర్గం రాంబిల్లి మండలం 7 గ్రామాలు /ప్రాంతాలలో గురువారం స్థానిక శాసన సభ్యులు సుందరపు విజయ్ కుమార్ తో కలిసి కలెక్టర్ విజయ్ కృష్ణ సుడిగాలి పర్యటన చేశారు. కలెక్టర్ కు ఎమ్మెల్యే విజయ్ కుమార్ తుఫాన్ సమయంలో తన నియోజకవర్గం రాంబిల్లి మండలం పరిధిలో గల 7 గ్రామాలలో జరిగిన నష్టాన్ని తెలియజేస్తూ నీటి మునిగిన ప్రాంతాలను చూపించారు.ముందుగా రాంబిల్లి మండలం కుమ్మరాపల్లి, రజాల ప్రాంతంలో శారదా నదికి గట్టు తెగిన ప్రాంతానికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. నదికి గండి పడి గట్టు తెగిపోవడంతో ఒక్కసారిగా వరద నీరు పొలాల్లోకి ప్రవహించింది. దీంతో వరి పంటకు తీవ్ర నష్టం జరిగిందని అలాగే చేపలు, రొయ్యల చెరువులు కూడా నష్టం వాటిల్లింది జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్,కు స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ తెలిపారు

తాగునీరు అందించే పంపు హౌస్ నదిలో గల్లంతు

విశాలాంధ్ర-కే కోటపాడు: మండలంలోని చౌడువాడ లో ఇందిరమ్మ కాలనీకి నిత్యం తాగునీరు అందించే మోటారు బోరు , షెడ్డులను ఉధృతంగా ప్రవహిస్తున్న శారదా నది ప్రవాహములో కొట్టుకుపోయాయి. నదికి 50 అడుగుల దూరంలో ఉన్న ఈ పంపు హౌస్ ను గ్రామపంచాయతీ ఐదు సంవత్సరాల క్రితం ఏర్పాటుచేసింది . ఇక్కడనుండి గ్రామంలో ఇందిరమ్మ కాలనీ లో గల వాటర్ ట్యాంకు కు నీరు అందిస్తున్నారు. ఆ ట్యాంకు ద్వారా ఇందిరమ్మ కాలనీ , గవరపేట మొదలగు వీధులకు ప్రతినిత్యం సురక్షితమైన నీరు అందిస్తున్నారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు రైవాడ డ్యామ్ గేట్లు ఎత్తడంతో నది ఉధృతంగా ప్రవహించి పంపు హౌస్ పునాదులతో సహా మొత్తంగా కొట్టుకుపోయింది. గ్రామ సర్పంచి దాడి ఎరుక నాయుడు. వార్డ్ మెంబర్ తన కల(పట్టాలు) అప్పలనాయుడు, గ్రామ పెద్దలు గురువారము శారదా నది ఒడ్డునవన్న పంపు హౌస్ వద్దకు వెళ్లి పరిశీలించగా నదీ ప్రవాహంలో కొట్టుకుపోయినట్లు గమనించారు. అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సర్పంచ్ తెలిపారు.

అన్నదాతకు దిక్కెవ్వరు?

- మొంతా తుఫాను వలన నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి
- ఏ.పీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి

విశాలాంధ్ర-చోడవరం: తుఫానులు, ప్రకృతి వైపరీత్యాలతో నిత్యం నష్టపోతున్న అన్నదాతకు దిక్కెవ్వరని... తక్షణమే అధికార ప్రభుత్వం అన్నదాతను ఆదుకోవాలని ఏ.పీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు డిమాండ్ చేశారు. మొంతా తుఫాను వలన కురుస్తున్న భారీ వర్షాలతో రైతాంగం పూర్తిగా నష్టపోయారని, నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం తక్షణమే అన్ని విధాల ఆదుకోవాలని కోరుతూ ..., ఈ మేరకు గురువారం స్థానిక మీడియా తో రెడ్డిపల్లి మాట్లాడుతూ వరి పంట చేతికి అందివచ్చే సమయంలో ప్రకృతి వైపరీత్యాలు, గిట్టుబాటు ధర రాక రైతాంగం ప్రతీ ఏటా నష్టపోతున్నాడని తెలిపారు. చోడవరం మండలంలోని 32 పంచాయితీ గ్రామాల్లో సుమారు 3500 హెక్టార్లకు పైగా సాగవుతున్న వరి పంట పొట్ట దశ, ఈనే సమయంలో ఉండగా, ప్రకృతి వైపరీత్యాలు, భారీ వర్షాలతో వరి వెన్నులు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. వరి చేలు నేలకొరిగాయని, మూడు రోజులుగా మొలలోతు నీటిలోనే ఉన్నాయని తెలియజేశారు. ప్రకృతి వైపరీత్యాలు, కూటమి పాలకుల దుశ్చర్యలు ... ఈ ఏడాది రైతాంగాన్ని బాగా కుంగదీసాయన్నారు. గోవాడ సుగర్స్ ను నష్టాల బాట పట్టించి, కార్మికులు, కర్షకులకు బకాయిలు చెల్లించకుండా, ఈ ఏడాది చెరకు గానుగాట జరపకుండా ... ఫ్యాక్టరీను మూసివేసిన అధికార కూటమి ప్రభుత్వం చెరకు రైతు కుటుంబాలను నిలువునా మోసం చేసి, ఆందోళనకు గురి చేసిందని తెలిపారు. చోడవరం మాడుగుల నియోజకవర్గాల్లో సుమారు లక్షకు పైగా చెరకు రైతు కుటుంబాలు వీధిన పడ్డాయి అన్నారు. ఆరుగాలం కష్టించి పండించిన వరి పంట చేతికి అంది వచ్చే సమయంలో భారీ వర్షాలు, కూటమిపాలకుల దుశ్చర్యలు.... రైతాంగం నోటి దగ్గర అన్నం లాక్కున్నట్లు చేసింది అన్నారు. గిట్టుబాటు ధర రాక రైతాంగం ఏటా నష్టపోతున్నారని తెలియజేశారు. జిల్లా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో సమూలంగా విచారణ జరిపి, తుఫాను భారీ వర్షాలతో నష్టపోయిన అన్నదాతను అన్ని విధాల ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. అన్నదాతను ఆదుకుంటేనే మునుగడ సాధ్యమని ప్రభుత్వాలు గుర్తించాలని కోరారు. ..

తుఫాన్ బాధితులకు అండగా జనసేన

గుర్రంపేటలో కూరగాయలు పంపిణీ కార్యక్రమం

విశాలాంధ్ర-నాతవరం: మొంథా తుఫాన్ బాధితులకు నర్సీపట్నం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్, బీసీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ రాజాన వీరసూర్యచంద్ర ఆధ్వర్యంలో వర్షాలతో ఇబ్బందులు పడుతున్న నాతవరం మండలం ఏపీ.పురం పంచాయతీ గుర్రంపేట గ్రామంలో తుఫాన్ నేపథ్యంలో ఇంట్లో నుంచి బయటకు వెళ్లలేని పలువురు బాధితులకు గురువారం కూరగాయలు పంపిణీ చేశారు. ఈ సందర్బంగా సూర్యచంద్ర మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తుఫాన్ నేపథ్యంలో ముందు చూపుతో పకడ్బందీ చర్యలు చేపట్టడంతో తుఫాన్ ముంపు నుండి బయటపడటం జరిగిందన్నారు. గ్రామంలో వర్షాల కారణంగా దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించి ఈ విషయాన్ని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు దృష్టికి తీసుకువెళ్లి నష్టపరిహారం అందించే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కష్టాల్లో, ఆపదలో ఉన్న ప్రజలకు జనసేన పార్టీ ఎప్పుడు అండగా నిలుస్తుందని చెప్పారు. అనంతరం నాతవరం జనసేన పార్టీ కార్యాలయంలో కూడా పలువురు బాధితులకు కూరగాయలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పూడి చక్రవర్తి, జిల్లా కార్యదర్శులు అల్లాడ సురేష్, పంచాడ హరినాథ్, నర్సీపట్నం వైస్ ఎంపీపీ ఇన్నం రమణ, నాతవరం మండల అధ్యక్షులు వెలగల వెంకటరమణ, సీనియర్ నాయకులు పోలుపర్తి శ్రీనివాస్, నాతవరం మండల ఉపాధ్యక్షులు గుడివాడ అసేన్ కుమార్, వర్రే నరసింహ, రెడ్డి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తమలపాకు పంటకు లక్షల్లో నష్టం

- లబోదిబోమంటున్న రైతులు
- ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్న రైతులు

విశాలాంధ్ర-పాయకరావుపేట: మోంథా తుఫాను కారణంగా పాయకరావుపేట మండలంలో తమలపాకు పంటకు లక్షల్లో నష్టం వాటిల్లింది. మండలంలో వరితోపాటు ప్రధానంగా తమలపాకు పంటను పండిస్తారు. మండలంలో మాసాహెబ్ పేట, గోపాలపట్నం, సత్యవరం, పెదరామభద్రపురం తదితర గ్రామాలలో సుమారు వెయ్యి ఎకరాల్లో తమలపాకు పంటను రైతులు పండిస్తున్నారు. ఎకరాకు సుమారు లక్ష రూపాయల వరకు రైతులు పెట్టుబడులు పెట్టారు. పంట చేతికి వస్తుందన్న సమయానికి తుఫాను వారి ఆశలను అడియాసలు చేసింది. ఈదురుగాలతో కూడిన తుఫాన్ కు మండలంలో సుమారు 100 ఎకరాలకు పైగా తమలపాకు పంట పూర్తిగా దెబ్బతినగా, సుమారు 70 ఎకరాల్లో పాక్షికంగా దెబ్బతిన్నట్లు అధికారులు అంచనాలు వేస్తున్నారు. జరిగిన నష్టం పై పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి నష్ట పరిహారం అందజేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఉద్యానవన శాఖ అధికారి సాయి ప్రియ గ్రామాల్లో తిరుగుతూ జరిగిన నష్టం పై అంచనాలు తయారు చేస్తున్నారు. అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్తల డాక్టర్ భవాని, డాక్టర్ గౌరీ కుమారి, డాక్టర్ ప్రసాద్ తదితరులు పంటల్లో తీసుకోవలసిన జాగ్రత్తలపై రైతులకు పలు సూచనలు అందజేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు గ్రామాల్లో తమలపాకు పంటకు జరిగిన నష్టాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు చించలపు ప్రదీప్, పట్టణ అధ్యక్షులు యాళ్ల వరహాల బాబు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కంకిపాటి వెంకటేశ్వరరావు, పిఏసిఎస్ చైర్మన్ చిక్కాల శ్రీనివాసరావు, మజ్జూరి నారాయణరావు, సిదిరెడ్డి నాగేశ్వరరావు, గొల్లపల్లి నాగు, వద్దాది వాసు, బొలిశెట్టి నాగేశ్వరరావు, కూలి నానాజీ, సఖిలేటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల

విశాలాంధ్ర-కే కోటపాడు : చౌడువాడ 33 / 11 కెవి సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ ల నిర్వహణ పనులు చెట్ల కొమ్మలు తొలగించడం తదితర పనుల నిమిత్తం శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్తు నిలుపుదల చేయడం జరుగుతుందని ఏఈ చంద్రశేఖర్ తెలిపారు. చౌడువాడ గరుగుబిల్లి మల్లం పాలెం తదితర గ్రామాల్లో ఉదయం 10 నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు . ఈ అసౌకర్యానికి ప్రజలు సహకరించాలని కోరారు.

పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన డిప్యూటీ డీఎంహెచ్ఓ

విశాలాంధ్ర-రోలుగుంట: రోలుగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డీఎంహెచ్ఓ కె.వీరజ్యోతి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్సీలో అందిస్తున్న ఆరోగ్య సేవలను పరిశీలించి, సిబ్బంది హాజరు రిజిస్టర్, రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి అవసరమైన సూచనలు అందించారు. తుఫాను కారణంగా సేవల్లో ఎలాంటి అంతరాయం ఏర్పడిందా సమాచారం తెలుసుకొని, వాక్సినేషన్ గదులను పరిశీలించారు. అనంతరం సంబంధిత అంశాలను అడిగి వివరాలు సేకరించారు. అనంతరం వైద్య సిబ్బందితో ప్రజలు మరిగించిన నీరు తాగాలి, తాజా ఆహారం తీసుకోవాలి, పాత్రలకు మూత పెట్టి వాడుకోవాలి, నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జ్వరం, విరేచనాలు వంటి లక్షణాలు కనబడితే వెంటనే పీహెచ్సీకి వచ్చి చికిత్స తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డా.వెంకట శ్రావణి, డా.మజీదా బేగం, ఎంపిహెచ్ఓలు కృష్ణ, గోవిందు, హెచ్ఎస్లు షాజహాన్, వరాహాలమ్మ, స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టులు పాల్గొన్నారు.

నవంబరు 5న మెగా జాబ్ మేళా : ఎమ్మెల్యే రాజు

విశాలాంధ్ర-చోడవరం: ఏ.పి నైపుణ్యాబివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ కల్పనలో భాగంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చోడవరంలో నవంబర్ 05న సుమారు 15 కంపెనీలతో నిర్వహించబోయే మెగా జాబ్ మేళా గోడ పత్రికను లక్షివారం నాడు ఎమ్మెల్యే రాజు చేతులమీదుగా పార్టీ కార్యాలయం లో విడుదల చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంటర్వ్యూలకు పదవ తరగతి, ఐ టి ఐ, డిప్లొమా, డిగ్రీ మరియు పి జి వరకు చదువుకొని 18 నుండి 35 సంవత్సరముల వయస్సు గల యువత జాబ్ మేళాలో పాల్గొనవచ్చునని తెలియజేసారు. కార్యక్రమంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి జిల్లా అధికారి ఎన్. గోవిందరావు తదితరులు పాల్గొన్నారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు తమ వివరములను నైపుణ్యం.ఏపీ.జీవో.ఇన్ వెబ్ సైట్ నందు తప్పనిసరిగా నమోదు చేసుకొని, రిఫరెన్స్ నెంబర్, రెస్యూమ్, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్లు జెరాక్స్ లతో ఉదయం 9 గంటలకు జాబు మేళాకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరములకు 9494791935 నంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జి.వి.ఎం.సి జోనల్ కమీషనర్, అధికారులు పాల్గొన్నారు.

మొంథా తుఫాన్ బాధితులకు నిత్యవసర సరుకులు పంపిణీ

విశాలాంధ్ర-కోటవురట్ల: గత నాలుగు రోజుల నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు పునరావాస కేంద్రాల్లో ఉన్న కుటుంబాలకు ప్రభుత్వ అధికారులు నాయకులు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. వర్షం బీభత్సానికి ఇల్లు కోల్పోయి నిరాశ్రయులైన వారిని, ముంపుకు గురైన గ్రామాలకు చెందిన వారికి ప్రభుత్వం పాములవాక, జల్లూరు, చిన్న బొడ్డేపల్లి, కోటవురట్ల, రాజుపేట, తంగేడు గ్రామాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పునరావాస కేంద్రాల్లో 30 కుటుంబాలు గత నాలుగు రోజుల నుండి తలదాచుకున్నాయి. గురువారం వర్షం తీవ్రత తగ్గడంతో వారందరినీ వారి గ్రామాలకు పంపించారు. వారందరికీ తహసిల్దార్ తిరుమల బాబు ఆధ్వర్యంలో ఒక్కొక్క కుటుంబానికి 25 కేజీలు బియ్యం కేజీ పంచదార పంపిణీ చేశారు. బాధితులకు కేజీ కందిపప్పు, కేజీ ఉల్లిపాయలు, కేజీ పామాయిల్ నూనె ప్యాకెట్ ఇవ్వవలసి ఉండగా, అవి అందుబాటులో లేనందున ఇవ్వలేకపోయామని, వాటిని త్వరలోనే బాధ్యతలకు అందజేస్తామని తహసిల్దార్ తిరుమల బాబు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షులు పెట్ల. లింగన్న నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం. కాశీనాయుడు,మాజీ మండల తెదేపా అధ్యక్షులు జానకి శ్రీను, జనసేన మండల పార్టీ అధ్యక్షులు శ్రీను , కూటమి నాయకులు పాల్గొన్నారు. నిత్యవసర సరుకులు పంపిణీ లో ఎంపీడీవో చంద్రశేఖర్, డిప్యూటీ ఎంపీడీవో కూర్మారావు, పంచాయతీ కార్యదర్శులు రఘురాం, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మొంథా తుఫాన్ తాకిడికి నీట మునిగిన ప్రాంతాలను పరిశీలించిన తాసిల్దార్

విశాలాంధ్ర-సబ్బవరం: మండలంలోని మొంథా తుఫాన్ తాకిడికి నీట మునిగిన ప్రాంతాలు ను స్థానిక తహసిల్దార్ బి. చిన్నికృష్ణ గురువారం తమ సిబ్బందితో పర్యటించి పరిశీలించారు. మండలంలోని పైడివాడ అగ్రహారం సరిపల్లి, పెచ్చెట్టి వారి చేనులు దగ్గర గెడ్డవాగు నీరు ప్రవాహం ఉధృతం కావడంతో పెచ్చెట్టి మహాలక్ష్మి నాయుడు ఇళ్లకు రాకపోకలకు నాలుగు రోజులుగా ఇబ్బంది ఎదురవడంతో ఆ గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో స్థానిక తహసిల్దార్ బి చిన్నకృష్ణ, సీఐ జి రామచంద్రరావు పరిశీలించారు. అయితే గతంలో ఈ గెడ్డపై కల్వర్ట్ నిర్మించాలని మాజీ ఎంపీటీసీ అక్కిరెడ్డి దుర్గి నాయుడు, ఎంపీటీసీ సీరం అప్పలరాజు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ మేరకు తాసిల్దార్ ఆ గెడ్డపై కల్వర్ట్ నిర్మాణానికి అధికారులకు నివేదిక పంపిస్తామని వారికి హామీ ఇచ్చారు. అలాగే చిన్నయపాలెం వద్ద సబ్బవరం -రాయపూర్ ఎక్స్ప్రెస్ హైవే జంక్షన్లో నీరు రోడ్డుపై ఎక్కువగా నిలవ ఉండటంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ రోడ్డుపై ఉన్న నీరును పంట పొలాలు ముంపున కు గురి కాకుండా బొర్రమ్మ గెడ్డకు మళ్లించినట్లు ఆయన తెలిపారు. అలాగే అంతకాపల్లి పంచాయతీ ఒమ్మి వానిపాలెం దగ్గర రైవాడ కాలువ తుఫాన్లకు, వరదలకు నీటి ప్రవాహం ఉధృతమై ఒమ్మి వానిపాలెం గ్రామము ముంపునకు గురికాకుండా జీవీఎంసీ సిబ్బంది రైవాడ కాలవను గండి కొట్టి సర్ఫస్ నీటి ను గౌరమ్మ చెరువు గెడ్డ కు మళ్ళించి నీటి ప్రవాహం తగ్గుముఖం పెట్టినప్పుడు మళ్లీ జీవీఎంసీ అధికారులు కాలవను పూడ్చి గట్టు నిర్మాణం యధావిధిగా చేస్తారని ఆయన తెలిపారు. ఈ మేరకు ఆయన రైవాడ కాలువ జీవీఎంసీ అధికారులు గండి కొట్టిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో వాత్సల్య రాయ్, పలువురు రెవిన్యూ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

శారదా నది మధ్యలో చిక్కుకున్న కుటుంబం రక్షించిన అగ్నిమాపక, ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలు

విశాలాంధ్ర-రాంబిల్లి: మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాల కారణంగా యలమంచిలి నియోజక వర్గంలోని రాంబిల్లి మండలం కొత్తూరు గ్రామం పరిసర ప్రాంతాల లో శారదా నది జలాశయం ఉధృతంగా ప్రవహించింది. ఈ క్రమంలో జలాశయం మధ్యలోని పామ్ ఆయిల్ తోటల వద్ద ఉన్న ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు కె. ప్రసాద్ (35), సువర్ణ (32), చందు (14) నీటిలో చిక్కుకున్నారు.జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశాల మేరకు అగ్నిమాపక శాఖ , రాష్ట్ర విపత్తుల స్పందన దళం (ఎస్‌డిఆర్ఎఫ్) సంయుక్తంగా గురువారం ఉదయం వేగవంతమైన రక్షణ చర్యలు చేపట్టింది. అగ్నిమాపక శకటంతో ప్రమాద స్థలానికి చేరుకున్న బృందాలు, స్థానిక శాసన సభ్యులు సుందరపు విజయ్ కుమార్ ఆధ్వర్యంలో సమన్వయంతో పనిచేసి శారద నది మధ్యలో చిక్కుకున్న ముగ్గురిని సురక్షితంగా రక్షించాయి. రక్షించబడిన వారిని అనంతరం జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పరామర్శించి, దిమిలి ప్రభుత్వం పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించేలా చర్యలు తీసుకున్నారు. ఈ సాహసోపేత రక్షణ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక అధికారి ఆర్. వెంకట రమణ, యలమంచిలి అగ్నిమాపక అధికారి డి. రాంబాబు, పరవాడ డి.ఎస్.పి. విశ్వ స్వరూప్, రాష్ట్ర విపత్తుల స్పందన దళం సభ్యులు పాల్గొన్నారు.

పంట నష్టం అంచనాపై పరిశీలన



విశాలాంధ్ర-వి.మాడుగుల : మొంథా తుపాన్ నేపథ్యంలో కురిసిన వర్షాల కారణంగా పంట నష్టం అంచనా వేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు గురువారం మాడుగుల మండలం పొంగలిపాక, పీ.శివరాంపురం గ్రామాల్లో సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్ గణేష్, కింతలి పిఏసిఎస్ చైర్మన్ ఉండూరు దేముడు, జనసేన కార్యకర్త పచ్చికూర నాగు, కోన నల్లన్న, గుంది కన్నారావు వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడక్కడ చిన్నపాటి ఇబ్బంది తప్ప ముందు జాగ్రత్త చర్యల వలన రైతులందరూ జాగ్రత్త పడటంతో పెద్దగా ఇబ్బంది తలెత్తలేదు. ఉండూరు సుభద్రమ్మ, ఉండూరు లక్ష్మీ పొలంలో ఉన్న వరి సుమరు ఒక హెక్టారు తుపాన్ వలన గింజ నలుపు రంగులోకి మారడం, మానుపుడి కాయలు రావడం జరిగింది. కొంత మేర వరి చేను పడిపోయింది. అనంతరం రైతులకు పలు జాగ్రత్తలు సూచించారు.

పలు గ్రామాల్లో పారిశుధ్య పనులు

విశాలాంధ్ర-యస్.రాయవరం :మండలంలో పలు గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టారు .ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామాల్లో మురుగు నీరు ,చెత్త చెదారం తొలగింపు పనులు ప్రారంభించారు .జె.వి.పాలెం గ్రామంలోని ఎంపిడిఓ పి.మీనాకుమారి ,డిప్యూటీ ఎంపీడీవో బంగారు సత్యనారాయణ లు పారిశుధ్య పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు

కోతకు గురవుతున్న సోముదేవుపల్లి గట్టు

ఆందోళన చెందుతున్న గ్రామస్తులు

విశాలాంధ్ర-యస్ .రాయవరం : మండలంలోని పెనుగొల్లు పంచాయతీ శివారు సోముదేవుపల్లి వద్ద వరహానది గట్టు మరింత కోతకు గురవుతుంది.గతంలోని భారీ వరదలకు గట్టు కోతకు గురైన సంఘతి తెలిసిందే .గట్టు నిర్మాణం చేయాలని అప్పటినుంచి గ్రామస్తులు ప్రజా ప్రతినిధులను అధికారులను అభ్యర్థించారు. గట్టు నిర్మాణం చేయకపోవడంతో తుఫాన్ నేపథ్యంలో ఎగువ ప్రాంతాల్లోని భారీ వర్షాలు కురవడంతో వరాహ నదిలోని వరద పెరిగింది .దీంతో వరద ప్రవాహం ఈ గ్రామం వద్ద మూలపాలెం గ్రోయిన్ సమీపంలో కోతకు గురైన ప్రదేశంలోని వరద ప్రవాహం చుట్టూ తిరగడంతో సుడిగుండాల్లాగా ఏర్పడి పాత గురవడంతో మట్టి నదిలోకి జారిపోవడం జరుగుతుంది. దీంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. రోజురోజుకు ఇలా జరగడంతో మరింత ఆందోళనగా ఉందని శాశ్వతమైన రక్షణ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు .వరదల వచ్చే సమయంలో ఈ గట్టు వలన ఏమి ప్రమాదం జరుగుతాదని అంచనా వేయలేక పోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు ఈ గట్టు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

మాసాహెబ్ పేటలో 3 ఇళ్ళు నేలమట్టం

విశాలాంధ్ర-పాయకరావుపేట: మండలంలోని మాసాహెబ్ పేట గ్రామంలో తుఫాను కారణంగా 3 ఇళ్ళు నేలమట్టం అయినట్టు గ్రామానికి చెందిన టిడిపి నాయకులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంకిపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. తుఫాన్ కారణంగా గత నాలుగు రోజులుగా భారీ వర్షాలు కురవడంతో గ్రామంలో కంకిపాటి అప్పలరాజు, కొంతం సత్యనారాయణ, వెలిశెట్టి నాగ సత్యనారాయణ లకు చెందిన పెంకుటిళ్ళు నేలమట్టం అయినట్లు తెలిపారు. ఇళ్ళు నేలమట్టంపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశామని, గ్రామంలో విచారణ చేసినట్లు తెలిపారు. ..

తుఫాన్ బాధితులను పరామర్శించిన చిన్న

విశాలాంధ్ర-పరవాడ: పరవాడ మండలం రావాడ పంచాయతీ పరిధి సోమునా యుడుపాలెంలో మొంథా తుఫాన్ దాటికి ఐదు ఇల్లు దెబ్బతిన్నాయి. ఈ దెబ్బతిన్న ఐదు ఇళ్లను గురువారం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వియ్యపు చిన్న పరిశీలించారు. బాధితులు వంటాకుల దేముడమ్మ, కూండ్రపు దేముడమ్మ, కూండ్రపు నాయుడు, కూండ్రపు ఎరుకులమ్మ, సిరిపురపు పైడంనాయుడులతో మాట్లాడి వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని చిన్నా భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో కూండ్రపు శ్రీనివాస్, బండారు అప్పలనాయుడు, సిరిపురపు సన్నిబాబు, కూండ్రపు పాలనాయుడు, సిరిపురపు అప్పలనాయుడు పాల్గొన్నారు.

నీట మునిగి పంట నష్టపోయిన రైతులకు ఎకరాకి 30వేల పరిహారం చెల్లించాలి

- చోడవరం నియోజక వర్గంలో వడ్డాది, విజయరామరాజుపేట బ్రిడ్జిలను శాశ్వత ప్రాతిపదికన నిర్మించాలి
- కాలువలు,డ్రైనేజీలను పూర్తి స్థాయిలో నిర్మించి వరద ముంపులను అరికట్టాలి
- ఏ.పి. రైతుకూలి సంఘం



విశాలాంధ్ర-చోడవరం రూరల్: చోడవరం నియోజకవర్గంలో గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వానలు, మొంథా తుఫాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా రైతులు, రైతు కూలీలు, ప్రజలు తీవ్రంగా నష్టపోయారన్నారు. మండలంలో వంద లాది ఎకరాల్లో వరి, చెరుకు, కూరగాయలు, ఉద్యాన పంటలు నీట మునిగాయిని, చోడవరం మండలంలో బానయ్య కోనేరు, రెల్లివీధి, ద్వారక నగర్, బాలాజీ నగర్ ప్రాంతాలు పూర్తి గా నీటమునిగాయిని, డ్రైనేజీలు,కాలువలు, పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉండటమే. దీనికి కారణమని ... వర్షాలు పడిన ప్రతిసారి అధికారులు, అధికార కూటమి ప్రభుత్వ పాలకులు, ఎమ్మెల్యే గుర్తిస్తున్నారని, ప్రజలు అదృష్టమో దురదృష్టమో తెలియదు కానీ అధికారులు, పాలకులు దానికి శాశ్వత పరిష్కారం చూపక పోవడంతో వానలు కురిసిన ప్రతీసారి ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. అనేకచోట్ల పంట కాలవలు, డ్రైనేజీలు ఆక్రమణలకు గురవుతున్నాయిని, దీని పర్యవసానంగా ఏ చిన్న వర్షం పడినా, డ్రైనేజీల్లో మురుగునీరు, వరద నీరు మొత్తం రోడ్లపై ప్రవహిస్తున్నదని తెలిపారు. రియల్ ఎస్టేట్, భూ ఆక్రమణలతో పంట చెరువులు కాలువలు మాయమవుతున్నాయి అన్నారు. దీంతో వరద ప్రవాహాలు నిలబడి పోయి, పంట పొలాలు, లోతట్టు ప్రాంతాలు మునిగిపోతున్నాయన్నారు. తక్షణమే రెవెన్యూ, పంచాయతీరాజ్, ఇరిగేషన్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇల్లు కూలిపోయిన నిర్వాసితులకు, పాడి పశువులను కోల్పోయిన వారికి, వరదల్లో కొట్టుకుపోయి మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని, లి చోడవరం - అనకాపల్లి, భీమిలి- నర్సీపట్నం రోడ్లను తక్షణమే నిర్మించాల్సిందిగా డిమాండ్ చేశారు.

In The Court of the Hon'ble Motor Accident Claims Tribunal cum Principal District Judge, Kadapa

M.V.O.P.No.32/2025

Chekka Lakshmi Devi & 3others
- petitioners

(vs)

Dilip Building Constructions Ltd, Rep by its Managing Partner, BhupendraKumar Sen, Major, Hindu, Owner of the TATA Camper bearing No.AP-05-PM-4083, R/O. D.No.4-53, gollapeta(vill), Koduru (po), Anakapalli District.
- Respondent No.1

Notice:-

ఇందుమూలముగా తెలయజేయదమేమనగా మొదటి వాదియొక్క భర్త టాటా క్యాంపర్ ఆక్సిడెంటులో చనిపోయి నందులకు గాను, పైవాదులు, పైప్రతివాది పైన దాఖలు చేసిన పిటిషను వాయిదా 13-11-2025వ తేదీన వున్నది. కావున పైప్రతివాది 13-11-2025వ తేదీన ఉదయం 10:30గంటలకు పైకోర్టు నందు వకీలు ద్వారా గాని, లేక ఖుద్దున గాని హాజరై ఆక్షేపణలు వున్నయెడల తెలుపుకోవలెను. లేనియెడల పరోక్షముగా తీర్మానించబడును.

ఇట్లు,
యం.రామాంజనేయ రెడ్డి MA.,BL,
కడప

పాస్ పోర్ట్ పోయినది

నేను చందక పోలేంద్ర రావు s/o కోటి నా పాస్ పోర్ట్ నెంబరు: M3014124 గల పాస్‌పోర్ట్ మాకవరం నుండి మార్టూరు మార్గమధ్యలో వెళుతుండగా మిస్సింగ్ అయిపోయినది. ఎంత వెతికినా దొరకలేదు ఎవరికైనా దొరికితే దయచేసి ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించవలెను.. ఫోన్ నెంబర్లు..**6303684464, 9014882014** చందక పోలేంద్ర రావు s/o కోటి, పాపయ్య సంతపాలెం, గ్రామం, పోస్టు, అనకాపల్లి మండలం. అనకాపల్లి జిల్లా పిన్‌కోన్: 531032

ఇంటి స్థలం డాక్యుమెంట్లు పోయినవి

అనకాపల్లి జిల్లా, పాయకరావుపేట మండలం, పాయకరావుపేట దుర్గా కాలనీ కి చెందిన పెదిరెడ్డి గౌరీ W/O శ్రీనుకు చెందిన 76 గజాల స్థలానికి సంబంధించి ఇంటి స్థలం డాక్యుమెంట్లు పాయకరావు పేట బస్టాండ్ లో తేదీ **29.10.2025**న పోయినవి. డాక్యుమెంట్లు దొరికినవారు ఫోన్..**9347189363** నెంబర్ కు సమాచారం అందజేయగలరు.

విశాలాంధ్ర అనకాపల్లి
పేజి : 2
శుక్రవారం 31, అక్టోబరు 2025

వరి పంటల రైతులు అప్రమత్తంగా ఉండాలి: వ్యవసాయ శాస్త్రవేత్త బి. భవాని

విశాలాంధ్ర-యస్ .రాయవరం : ఇటీవల పురుషుల వర్షాల ప్రభావంతో రైతులు వరి పంటల విషయంలో అప్రమత్తంగా ఉండాలని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త(కీటక శాస్త్ర విభాగం) డాక్టర్ బి భవాని అన్నారు. గురువారం మండలంలోని దార్లపూడి తదితర గ్రామాల్లో స్థానిక వ్యవసాయ అధికారులు తో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.... ప్రస్తుతం వరి పిలకలు అడుగు పొట్ట దశలో ఉన్న వరి పంట లోని కొన్నిచోట్ల పొటాషియం లోపం ఉందని అన్నారు .పొలాల్లోని వర్షం నీరు పూర్తిగా తగ్గిన తర్వాత అడుగు పొట్ట దశలో ఉన్న వాటిపై ఎకరాకు 20 కిలోల మ్యూరెట్ ఆఫ్ పొటాష్ , 20 కిలోల యూరియా చల్లడం వల్ల వారికి ఎంతో మంచిదని సూచించారు తదితర విషయాలపై రైతులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం జి బి ఎస్ కుమారి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం. రవిబాబు, బి సిటీ శాస్త్రవేత్త డాక్టర్ ప్రసాదరావు, మండల వ్యవసాయ అధికారి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు

విశాలాంధ్ర -పాయకరావుపేట: మండలంలోని పలు గ్రామాలలో పంచాయతీ అధికారులు పారిశుధ్య పనులు చేపట్టారు. తుఫాన్ కారణంగా వీధుల్లో పేరుకుపోయిన మురికి, చెత్తను తొలగించి వేస్తున్నారు. అలాగే ముఖ్యమైన ప్రదేశాలలో బ్లీచింగ్ చల్లుతున్నారు. మండలంలోని శ్రీరాంపురం, వెంకటనగరం గ్రామాలలో పంచాయతీ కార్యదర్శి వై.సత్యనారాయణ పారిశుద్ధ్య పనులు చురుగ్గా నిర్వహిస్తున్నారు. ఇంటి పరిసరాల్లో వర్షం నీరు నిల్వ ఉండకుండా ప్రజలు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తుపాన్ ప్రభావిత గ్రామాల్లో సూపర్ శానిటేషన్, క్లోరినేషన్- ఎంపీడీవో పి. పద్మజ

విశాలాంధ్ర -నబ్బవరం: మండలంలోని మొంథా తుఫాన్ కారణంగా గ్రామాలలో డ్రైనేజీలు, సిసి రోడ్లు, వీధులు చెత్తాచెదారంతో నిండి ఉండడం, నీటి ప్రవాహంతో ముంపునకు గురైన ప్రాంతాలలో సూపర్ శానిటేషన్ నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎంపీడీవో పి. పద్మజ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మొగలిపురం, మల్లునాయుడు పాలెం, గుల్లేపల్లి, గాలిభీమవరం, వంగలి, నారపాడు, బాట జంగాలపాలెం, సబ్బవరం గ్రామాలలో పర్యటించి సూపర్ శానిటేషన్ కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో డ్రైనేజీలు, సిసి రోడ్లు చెత్తాచెదారం లేకుండా శుభ్రం చేయడం, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, వాటర్ ట్యాంకులు క్లోరినేషన్ చేయడం,తాగునీరు పరిశుభ్రం చేయడం,ప్రజలకు తాగునీరు కొరత లేకుండా చేయడం వంటి కార్యక్రమాలు సూపర్ సానిటేషన్ కార్యక్రమంలో చేపట్టినట్టు ఆమె తెలిపారు.అలాగే తుఫాన్ వల్ల అంగన్వాడి కేంద్రాలు గాని, పంచాయతీ కార్యాలయాలు గాని, సచివాలయాలు గాని, పాఠశాలలు గాని కూలిపోయిన, పడిపోయిన వాటికి ఎస్టిమేషన్ వేసి అధికారులకు పంపాలని తమకు ఆదేశాలు ఉన్నత అధికారుల నుండి అందినట్లు తెలిపారు. ఈ మేరకు ఆయా గ్రామాల సెక్రటరీలు, సచివాలయం సిబ్బంది, తుఫాన్ తాకిడికి ప్రభుత్వ ఆస్తులకు నష్టం జరిగితే నష్టం అంచనా వేయడానికి గ్రామాలలో పర్యటిస్తున్నట్లు ఆమె తెలిపారు.

1500 మంది తుఫాన్ బాధితులకు నిత్యావసరాల పంపిణీకి చర్యలు

విశాలాంధ్ర - రోలుగుంట: రోలుగుంట గ్రామంలో తుఫాన్ ప్రభావిత కుటుంబాలతో గురువారం ఎంపీటీసీ సుర్ల రామకృష్ణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తుఫాను బాధితులు 1500 మంది కార్డు లబ్ధిదారులు ఎంపికైనట్లు తెలిపారు. తుఫాన్ వల్ల నష్టపోయిన కుటుంబాలకు సరైన సహాయం అందించేందుకు స్థానిక ఎమ్మెల్యే రాజు ఆదేశాల మేరకు చర్యలు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. లబ్ధిదారులందరికీ 25 కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, కేజీ పంచదార, కేజీ నూనె ప్యాకెట్లను పంపిణీ చేయనున్నట్లు రామకృష్ణ తెలిపారు. ప్రజలకు అవసరమైన వస్తువులు సమయానికి అందేలా అధికారులతో సమన్వయం చేసి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. తుఫాన్ కారణంగా ఎవరూ ఇబ్బందులు పడకుండా ప్రతి కుటుంబం వద్దకు సాయం చేరేలా పర్యవేక్షణ కొనసాగుతోందని పేర్కొన్నారు. గ్రామంలో నష్టాలు, అవసరాలపై ప్రజలు తెలియజేయాలని, ప్రభుత్వం సహకారంతో తగిన పరిష్కారం కల్పిస్తామని రామకృష్ణ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుర్ల నరసింహమూర్తి, బీసీ యాత సాధికారిత రాష్ట్ర కన్వీనర్ ఒనుం శ్రీనివాసరావు, వార్డ్ మెంబర్ శ్రీను, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడిపై కత్తితో దాడి

విశాలాంధ్ర-పాయకరావుపేట: మండలంలోని మాసాహెబ్ పేట గ్రామంలో బంటుపల్లి అయ్యారావు అనే వృద్ధుడిపై అదే గ్రామానికి చెందిన తిరంశెట్టి సత్యనారాయణ కత్తితో దాడి చేసి గాయపరిచాడు. పక్క పక్కనే ఇళ్లల్లో నివాసం ఉంటున్న ఇద్దరికీ వర్షం నీరు వెళ్లే మార్గం విషయమై వివాదం జరిగింది. దీంతో సత్యనారాయణ కత్తి తీసుకొని అయ్యారావుపై దాడి చేసి గాయపరిచాడు. అయ్యారావు తుని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దాడి విషయమై ఫిర్యాదు అందినట్లు సీఐ అప్పన్న తెలిపారు.

తుఫాన్ ప్రభావంతో పైడివాడ అగ్రహారం గ్రామంలో తీవ్ర నష్టం.

విశాలాంధ్ర- సబ్బవరం: మండలం లోని పైడివాడ అగ్రహారం గ్రామంలో మొంథా' తుఫాన్ ప్రభావంతో పైడివాడ అగ్రహారం గ్రామంలో తీవ్ర నష్టాన్ని మిగిలించిందని ఎంపీటీసీ సీరం అప్పలరాజు, మాజీ ఎంపీటీసీ అక్కిరెడ్డి రామలక్ష్మి దుర్గినాయుడు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం దీనికి తోడు గెడ్డలు మరియు వాగులు సంబంధించి కనీసం పూడుకులు తీయక పోవడం తో వర్షం నీరు గ్రామంలోనికి ప్రవేశించింది గ్రామాల్లో సుమారు ఐదు అడుగుల పైనే నీరు నిలిచిపోయింది. గ్రామంలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వల్ల ఇళ్ల మధ్యలో వరుసపు నీరు నిలిచిపోయింది. దీనివల్ల ఇళ్లల్లోకి వరద నీరు ప్రవేశించింది కనీసం త్రాగు నీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బోర్లు ఆన్ చేస్తే బురద నీరు వస్తుంది. గెడ్డ వాగులు నుంచి వచ్చే నీరు గ్రామాల్లోనికి ప్రవేశించడం వల్ల చెత్తాచెదారంతో నిండిపోయింది. అలాగే పెచ్చెట్టి వారి ఇళ్ల వద్ద కొండల నుంచి వచ్చే వరుసపు నీటితో తుమ్మల చెరువులోకి వెళ్లే వాగు ఉధృతంగా ప్రవహించడం వల్ల గడిచిన రోజుల్లో రాకపోకలు నిలిచిపోయాయి. తీవ్రంగా ఇబ్బంది పడ్డారు అలాగే లంకెలపాలెం-అసకపల్లి వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డుపైన వరుసపు నీరు చేరడం వలన గ్రామం వద్ద రోడ్డు పరిస్థితి చాలా దారుణంగా ఉంది రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నది ప్రస్తుతం గ్రామం వద్ద ఆర్ %చ% బి రోడ్డు చెరువులను తలపిస్తుంది. ఇదే విషయంపైన స్థానిక తహసిల్దార్ బి చిన్నికృష్ణ స్థానిక సీఐ జి రామచంద్రరావు గ్రామంలో గురువారం సందర్శించి పరిస్థితులను ప్రభుత్వానికి తెలియజేస్తామని చెప్పారు ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, ఎంపీటీసీ సభ్యులు సీరం అప్పలరాజు, మాజీ ఎంపీటీసీ సభ్యులు అక్కిరెడ్డి రామలక్ష్మి దుర్గినాయుడు, గ్రామ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

మోదకొండమ్మ ఆలయ అభివృద్ధికి రూ.25వేల విరాళం

విశాలాంధ్ర - వి. మాడుగుల : మాడుగుల మండలం ఎం.కోడూరులోని శ్రీమోదకొండమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధికి గ్రామానికి చెందిన కొల్లి శంకర్రావు దంపతుల కుమార్తె ఆర్లి కుమారి రూ.25 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ మొత్తంతో ఆలయానికి ప్రహరీ గోడ, ఇనుప గేటు ఏర్పాటు చేస్తామని గ్రామ సర్పంచ్, ఆలయ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి సంజీవరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన దాతను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ముమ్మిన రమణబాబు, టిడిపి నాయకుడు విశ్వనాథ్, వానపల్లి వేణు, పోతిని జగదీష్, వద్దాది గణేష్, పోలిపల్లి కృష్ణ, రాయపరెడ్డి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలి

విశాలాంధ్ర-మునగపాక: మొంథా తుఫాన్ కారణంగా తీవ్రంగా నష్టపోయిన రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష,కోశాధికారులు కర్రి అప్పారావు,గండి నాయన బాబులు డిమాండ్ చేశారు.ఈ మేరకు గురువారం మండలంలోని యాదగిరిపాలెం,చూచుకొండ,గణపర్తి,ఆనందపురం తదితర గ్రామాలలో పర్యటించారు.తుఫాన్ కారణంగా నేల వాలిన చెరకు పంటలను,వరి పొలాలను పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలం లో అత్యధికంగా ఉండే పాడి రైతులకు వర్షాల కారణంగా పశుగ్రాసం కొరత తీవ్రంగా ఉందని ప్రభుత్వం పాడి రైతులను ఆదుకునేందుకు ఉచితంగా పశుదాణా పంపిణీ చేయాలన్నారు.తుఫాను వంటి విపత్తుల సమయంలో పశువుల ప్రాణాలకు రక్షణ నిచ్చే షెల్టర్లను నిర్మించాలన్నారు. .అదేవిధంగా వరద ఉధృతి ఎక్కువగా ఉన్న సమయాలలో ప్రయాణికులకు అసౌకర్యంగా ఉన్న చూచుకొండ - గణపర్తి గ్రామాల మధ్య ఉండే బ్రిడ్జి ఎత్తు పెంచి నిర్మాణం చేపట్టాలన్నారు.అధికారులు తాత్సారం చేయకుండా భారీ వర్షాల కారణంగా రైతులు నష్టపోయిన పంట భూములను సందర్శించి రైతులను తక్షణమే ఆదుకోవాలని అన్నారు.వర్షాల కారణంగా నష్టపోయిన చెరకు రైతులకు ఎకరాకు రూ. 50 వేలు, వరి రైతులకు రూ. 25 వేలు పంట నష్టపరిహారాన్ని అందజేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ రాము,కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.బ్రహ్మాజీ,కూండ్రపు సోమునాయుడు,కాంగ్రెసుల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మొంథా తుఫాన్ ప్రభావంతో ముంపునకు గురి అయినా ప్రాంతంలో పునరావాసం కల్పించుటలో ప్రభుత్వం విఫలం

విశాలాంధ్ర-మునగపాక: మొంథా తుఫాన్ ప్రభావంతో ముంపునకు గురి అయినా ప్రాంతంలో పునరావాసం కల్పించుటలో ప్రభుత్వం విఫలమైందని అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్,యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ అన్నారు.మేజర్ పంచాయతీ మునగపాక బొడ్డేడ ప్రసాద్ క్యాంపు కార్యాలయంలో మొంథా తుఫాన్ పై విలేకరుల సమావేశం గురువారం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయడం విఫలమైందని వారు అన్నారు.మండలంలోని చూచుకొండ,గణపర్తి,మెల్లిపాక,యాదగిరిపాలెం గ్రామాలు తుఫాన్ కారణంగా మునిగిపోవడంతో ప్రభుత్వం స్పందించే వెంటనే ప్రజలకు ముంపు ప్రాంతాలకు తగిన రీతిలో సౌకర్యాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో జడ్పీటీసీలు సోము సత్యనారాయణ,నాగరాజు,మండలం పార్టీ అధ్యక్షులు ఆడారి గణపతి అచ్చియ్యనాయుడు,కిషోర్ రాజు,నాయకులు కాంగ్రెసుల జగన్,మొల్లేటి శంకర్,పల్లె నాయుడు తదితరులు పాల్గొన్నారు.

1500 మంది తుఫాన్ బాధితులకు నిత్యావసరాల పంపిణీకి చర్యలు

విశాలాంధ్ర -రోలుగుంట: రోలుగుంట గ్రామంలో తుఫాన్ ప్రభావిత కుటుంబాలతో గురువారం ఎంపీటీసీ సుర్ల రామకృష్ణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తుఫాను బాధితులు 1500 మంది కార్డు లబ్ధిదారులు ఎంపికైనట్లు తెలిపారు. తుఫాన్ వల్ల నష్టపోయిన కుటుంబాలకు సరైన సహాయం అందించేందుకు స్థానిక ఎమ్మెల్యే రాజు ఆదేశాల మేరకు చర్యలు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. లబ్ధిదారులందరికీ 25 కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, కేజీ పంచదార, కేజీ నూనె ప్యాకెట్లను పంపిణీ చేయనున్నట్లు రామకృష్ణ తెలిపారు. ప్రజలకు అవసరమైన వస్తువులు సమయానికి అందేలా అధికారులతో సమన్వయం చేసి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. తుఫాన్ కారణంగా ఎవరూ ఇబ్బందులు పడకుండా ప్రతి కుటుంబం వద్దకు సాయం చేరేలా పర్యవేక్షణ కొనసాగుతోందని పేర్కొన్నారు. గ్రామంలో నష్టాలు, అవసరాలపై ప్రజలు తెలియజేయాలని, ప్రభుత్వం సహకారంతో తగిన పరిష్కారం కల్పిస్తామని రామకృష్ణ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుర్ల నరసింహమూర్తి, బీసీ యాత సాధికారిత రాష్ట్ర కన్వీనర్ ఒనుం శ్రీనివాసరావు, వార్డ్ మెంబర్ శ్రీను, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా పరిశ్రమలకు వెంటనే విద్యుత్ సరఫరా చేయాలి

సిటూ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకరరావు డిమాండ్

విశాలాంధ్ర-పరవాడ: ఫార్మా పరిశ్రమలకు గత మూడు రోజులుగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో జనరేటర్లపై ఫార్మా ఉత్పత్తి కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని వెంటనే పరిశ్రమలకు విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు డిమాండ్ చేశారు. పరవాడ సిఐటియు కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫార్మా పరిశ్రమలకు విద్యుత్ సరఫరాపై నిర్లక్ష్యం తగదన్నారు. తుఫాన్ కారణంగా నిలిచిపోయిన విద్యుత్తును వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. జనరేటర్లపై ఫార్మా ఉత్పత్తి కార్యకలాపాలు నిర్వహించడంతో యూనిట్ విద్యుత్తు 9 రూపాయల నుండి 30 రూపాయలు ఖర్చవుతుందని దీనికి తోడు ట్రంప్ సుంకాలు కారణంగా ఫార్మా పరిశ్రమలు నష్టాలు పాలైతే కొన్ని చిన్న పరిశ్రమలు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ముందస్తు ప్రణాళిక లేకపోవడం వలన విద్యుత్తు సరఫరా నిలిచిపోయి పరిశ్రమలు ఇబ్బంది పడుతున్నాయన్నారు. ఇప్పటికే అనేక పరిశ్రమలు సకాలంలో వేతనాలు చెల్లించడం లేదని కార్మికులు ఆవేదన చెందుతున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు వివి శ్రీనివాసరావు, ఫార్మాసిటీ స్టాఫ్ ఎండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

..